క్లుప్తంగా

12 నుంచి శ్రీలక్ష్మీ మహాయజ్ఞం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న అష్టోత్తర శత (108) కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యజ్ఞానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆర్డీఓ రాఘవేంద్ర ఆవిష్కరించారు. ఖాద్రీ ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకుడు నరసింహాచార్యులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: ఈ నెల 17న మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. ఈ మేరకు ఆయన సర్వసభ్య సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై అధికారులతో మాట్లాడారు. ఎంపీపీ భాగ్యమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

డీఎస్పీ టి.శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



ధర్మవరం అర్బన్: ధర్మవరం డీఎస్పీగా టి.శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన ఇక్కడే 2006 సంవత్సరంలో పట్టణ సీఐగా విధులు నిర్వర్తించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని డీఎస్పీ టి.శ్రీనివాసులు తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న డీఎస్పీ రమాకాంత్ కడప జిల్లా దిశా డీఎస్పీగా బదిలీ అయ్యారు. ధర్మవరం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు జూనపాటి మోహన్, ప్రధాన కార్యదర్శి మురళీగౌడ్ నూతన డీఎస్పీని శాలువాలు, బొకేలతో సత్కరించారు.

అర్హులకు పథకాలు అందించాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రాజశేఖర్ రెడ్డి

పుట్టపర్తి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలపై బుక్కపట్నం మండల ప్రత్యేక అధికారి రాజశేఖర్‌రెడ్డి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవరత్నాల్లో భాగంగా అందరికీ ఇళ్ల మంజూరు, నిర్మాణాలపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలని సూచించారు. ఇది సీఎం జగన్ ప్రధాన ధ్యేయమన్నారు. సిబ్బంది మరింత సమర్థవంతంగా పని చేసి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, డీటీ రామకృష్ణ, ఉపాధి ఏపీఓ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు

చెన్నేకొత్తపల్లి: ఈనెల 25న న్యామద్దల గ్రామంలో రాష్ట్రస్థాయి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు 9493134951లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఘనంగా జాతీయ సాంకేతిక దినోత్సవం



ప్రొజెక్టర్ ద్వారా పీఎం మోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జీవన్ కుమార్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ వర్చ్యువల్ ద్వారా ప్రసంగించిన ఉపన్యాసాన్ని విద్యార్థులు వీక్షించారు. సాంకేతిక రంగంలో సాధించిన విజయాలు, శాస్త్రవేత్తల విశేష కృషిని ప్రిన్సిపాల్ వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రబియాబేగం, చిట్టెమ్మ, షమీవుల్లా, పావని, భువనేశ్వరి, రామ్మోహన్‌రెడ్డి, పుష్పవతి, గౌతమి, ఆనంద్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

కదిరి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 1777లో ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. పేదలందరికీ ఇల్లు నినాదంతో అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇంటి పట్టాలను నిరంతరం అందజేయడం జరుగుందన్నారు. అందులో భాగంగా సర్వే నంబర్ 1777లో పేదలకు ఇళ్ల పట్టాలను అందజేసేందుకు ఏర్పాటు చేస్తున్న జగనన్న లే అవుట్‌ను అధికారులతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ నష్టపోకుండా ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇంటి పట్టాలను అందజేస్తుందని తెలిపారు. ఇళ్లు నిర్మించుకునేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తుందన్నారు. మంచి లే అవుగ్‌లో రూ.లక్షలు విలువ చేసే స్థలాలను పేదలకు అందజేయడం గర్వంగా ఉందన్నారు. ఇంకా ఎవరైనా అర్హులైన లబ్ధిదారులు ఉంటే మీ సచివాలయ పరిధిలో ఇళ్ల పట్టాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పరికి సాధిక్ బాషా, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తనకల్లు: అన్నమయ్య జిల్లా మదనపల్లిలో మృతి చెందిన అక్రం కుటుంబానికి ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. మండల పరిధిలోని కోటూరులోని మృతుడి స్వగృహంలో గురువారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్ ఆ మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజావలి, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

నల్లచెరువు: మండల పరిధిలోని మద్దిమడుగు గ్రామానికి చెందిన ఎం.గోవిందు రెడ్డి (95) బుధవారం విష ద్రావకం సేవించి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. విషయం తెలుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి గురువారం ఆసుపత్రి వద్దకు చేరుకుని గోవిందు రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నల్లచెరువు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని చిత్రావతి రోడ్డులో ఉన్న శ్రీసత్యసాయి సదన్‌లో ఈనెల 13వ తేదీ ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ భిక్షమయ్య గురూజీ ఆధ్వర్యంలో అంతర్ముఖ ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగి నాగార్జునశెట్టి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 73829000786 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

రామగిరి: రైతుశ్రేయస్సే ప్రభుత్వ ఉద్దేశమని వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మాదాపురం గ్రామ సచివాలయం ఆవరణలో ప్రభుత్వం సచివాలయానికి మంజూరు చేసిన సబ్సిడీ ట్రాక్టర్‌ను ప్రారంభించారు. పంచాయతీలో రైతుల వ్యవసాయ పనులకు సంబంధించి ఇతర ట్రాక్టర్ల కంటే తక్కువ ధరకే పొలం పనులు చేసే విధంగా దీన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. గ్రామంలో శ్రీసాయి సిద్ధార్థరెడ్డి రైతుమిత్ర సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వం అందించే 40 శాతం సబ్సిడీతో కొనుగోలు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోయనాగేంద్ర, చిన్నపెద్దన్న, సుబ్రమణ్యం, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా నిలుస్తున్నాం



బోరుబావి తవ్వకాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

కనగానపల్లి: ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తూ అన్నదాతలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. గురువారం మండల కేంద్రం కనగానపల్లిలో ఆమె తోపుదుర్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద రైతులకు వేస్తున్న ఉచిత బోర్ల కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో రైతులు వైఎస్సార్ జలకళ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎమ్మెల్యే సొంత నిధులతో పేద రైతులందరికీ ఉచితంగా బోర్లు వేయిస్తున్నారన్నారు. దీన్ని రైతులంతా సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు.

ప్రతి కార్యకర్తకూ తోడుగా నిలుస్తాం..

వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడి పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకూ తోడుగా నిలుస్తామని పార్టీ నేత తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉచిత బోర్ల ప్రారంభ కార్యక్రమం అనంతరం ఆయన కనగానపల్లిలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. గతంలో ఈ ప్రాంతంలో ఉన్న దోపిడీదార్ల పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగించేందుకు తమతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. వెనుకబడిన ప్రాంతంగా ఉన్న కనగానపల్లి, రామగిరి మండలాల్లో తాము అధికారంలో లేనప్పటి నుంచి రైతులకు ఉచితంగా బోర్లు, గొర్రెలు, పాడి ఆవులు ఇచ్చి, అండగా నిలిచామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే కాగానే 10 నెలల్లోపు పేరూరు డ్యాంను నీటితో నింపామన్నారు. నియోజక వర్గంలోని అన్ని చెరువులు నింపటంతో పాటు అవసరమైన రైతులకు ఉచితంగా బోర్లు వేయిస్తున్నామన్నారు. ఇక నియోజక వర్గంలో 25 వేల ఇళ్లు మంజూరు చేయించి, జగనన్న కాలనీల్లో తామే సొంతంగా ఇళ్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యమ్మ భర్త నాగముని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, యూత్ కన్వీనర్ అంకే అశోక్, డైరెక్టర్ ప్రభాకర్, పార్టీ నాయకులు లాయర్ నల్లప్ప, గోపాల్, రమేష్‌గౌడ్, మల్లికార్జున, రామలింగారెడ్డి, వన్నూరప్ప, అనిల్, నారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

గుడికట్టు మహోత్సవం రేపు



మాట్లాడుతున్న కురుబ సంఘం నేతలు

పుట్టపర్తి: ఈనెల 13వ తేదీన పుట్టపర్తి సాయి ఆరామంలో జరిగే కురుబల గుడికట్టు మహోత్సవానికి కురుబలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం వారు బుక్కపట్నంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీలకు అతీతంగా ఉమ్మడి జిల్లాల నుంచి కురుబలు హాజరు కావాలని సూచించారు. గొరవయ్యలు, పూజారులుతో చర్చించి మహోత్సవం విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. కురుబలు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. రాజకీయంగా ఎదగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు సామకోటి ఆదినారాయణ, ఈశ్వర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

రామగిరి: మండల కేంద్రమైన రామగిరి గ్రంథాలయంలో నాలుగు రోజులుగా వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి వెంకటేష్ గురువారం తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా సమ్మర్ క్యాంప్ 35 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులకు కథలు వినిపించడం, కథలు చెప్పడం, ఆటలు, తదితర వాటిలో భాగంగా గురువారం డ్రాయింగ్ పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ధర్మవరం రూరల్: గ్రంథాలయ శాఖ ద్వారా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఉపయోగపడుతాయని బత్తలపల్లి గ్రంథాలయ శాఖ అధికారిణి బి.రాజేశ్వరి తెలిపారు. గురువారం గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, కథలు చదివించడం, పేపర్ ఆర్ట్స్ తదితర వాటిపై అవగాహన కల్పించారు.

తప్పుడు ప్రచారం చేసే వారిని శిక్షించండి



ఎస్‌ఐ వెంకటనారాయణకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అమడగూరు: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం చేసే వాళ్లను శిక్షించాలని కోరుతూ గురువారం ఎస్‌ఐ వెంకటనారాయణకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నల్లమాడ మండలం, నల్లశింగయ్య గారిపల్లికి చెందిన టీడీపీ నాయకుడు చాంద్‌బాషా బావమరిది బాబ్‌జాన్ పుట్టపర్తిలో మైనర్ బాలికను కిడ్నాప్ చేశాడన్నారు. అయితే కిడ్నాప్‌కు పాల్పడిన బాబ్‌జాన్ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితో పాటుగా టీడీపీ నాయకులతో కలిసి తీయించుకున్న ఫోటోలు ఉన్నాయని తెలిపారు. బీజేపీకి చెందిన జ్యోతిప్రసాద్.. ఎమ్మెల్యేతో కలిసి బాబ్‌జాన్ తీయించుకున్న ఫొటోను ఫేస్‌బుక్, వాట్సాప్, ఇతర సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పార్టీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని పూర్తిగా ఖండిస్తూ బీజేపీ నాయకుడు జ్యోతి ప్రసాద్, ఇతరులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు శివశంకర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, రమణారెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీపతి, పకీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సమష్టిగా కృషి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామానాయక్

తలుపుల: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా మండలాభివృద్ధికి పాటుపడదామని ఎంపీపీ రఫీనాయక్ అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ రామానాయక్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు వివరించారు. సహకార పరపతి సంఘం అధ్యక్షుడు పూల శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఏ సమస్య పరిష్కారం ఎక్కడ పరిష్కారమవుతుందో తెలియని స్థితి నుంచి మన గ్రామం చెంతనే మన సమస్య పరిష్కారమయ్యే స్థితికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని కొనియాడారు. ఖరీఫ్‌లో విత్తన వేరుశనగ అందజేసేందుకు రిజిస్ట్రేషన్లను ప్రారంభిస్తామని ఏఓ షాదాబ్ తెలిపారు. ఏపీఎం బాబ్జి మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళా సంఘాలకు విరివిగా లోన్లు మంజూరు చేస్తోందన్నారు. కదిరి రూరల్‌లో రూ.6 కోట్లతో దవణం, మల్లెల ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు చేపడుతోందన్నారు. పారదర్శకంగా పథకాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రఫీనాయక్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఓబుళేశ్వరి, మహేశ్‌రెడ్డి, ఈఓపీఆర్డీ శకుంతల, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నిర్మలా జ్యోతి

నల్లమాడ: మండలంలోని జగనన్న లే అవుట్‌లలో పక్కా గృహాల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి నిర్మలా జ్యోతి సంబంధిత అధికారులను ఆదేశించారు. జగనన్న పక్కా గృహాల నిర్మాణంపై గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నల్లమాడ మినహా తక్కిన లే అట్‌లలో లబ్ధిదారులకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే పరిష్కరించాలన్నారు. తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లు, ఇంజినీరింగ్ సహాయకులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయి సిబ్బందికి సహకరించాలని తహసీల్దార్, ఎంపీడీఓకు సూచించారు. లబ్ధిదారులకు ఎవరికైనా ఇంకా పట్టాలు ఇవ్వకుంటే వెంటనే పంపిణీ చేయాలన్నారు. జియో ట్యాగింగ్ తక్షణమే పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం మండలంలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. 4,340 ఇళ్లు మంజూరు కాగా.. 996 ఇళ్లు బేస్‌మెంట్, మరో 137 ముత దశలో ఉన్నట్లు, 14 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు హౌసింగ్ ఏఈ వరుణ్ తెలియజేశారు. లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు సిమెంట్, బిల్లులు మంజూరు చేస్తూ సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని ప్రత్యేకాధికారి సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ఎం.నాగరాజు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ



ఉత్తమ మార్కులు సాధించిన వసంతపురం విద్యార్థులు

ధర్మవరం రూరల్: అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లోని 5వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో మండలంలోని వసంతపురం ఎంపీపీ పాఠశాలకు చెందిన 5 మంది విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు సర్పంచ్ నాగానందరెడ్డి తెలిపారు. దిలీప్‌కుమార్ 50, హర్షవర్ధన్‌రెడ్డి 49, అమర్ 47, వికాస్ 44, లోకేష్ 43 మార్కులు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను సర్పంచ్, గ్రామస్తులు అభినందించారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ తాతం జగన్మోహన్

గాండ్లపెంట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ జగన్మోహన్ అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు శాఖల పురోగతిని వినిపించారు. ఎంఈఓ కృష్ణానాయక్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరానికి ముందే పాఠ్యపుస్తకాలు, జగనన్న విద్యాకానుక పంపిణీ చేస్తామన్నారు. ఖరీఫ్‌లో రైతులకు 40 శాతం సబ్సిడీతో కే6, లేపాక్షి రకం వేరుశనగ విత్తనకాయల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఏఓ లక్ష్మీప్రియ తెలిపారు. మండల వ్యాప్తంగా 6,650 మంది రైతులు ఉండగా 1,100 మంది రైతులు ఈ-కేవైసీ చేసుకోలేదని వెల్లడించారు. గ్రామాల్లో వలంటీర్ల వద్ద ఈ-కేవైసీ చేసుకునేలా ప్రజా ప్రతినిధులు రైతులకు తెలియజేయాలన్నారు. తహసీల్దార్ రవి మాట్లాడుతూ.. భూముల రీ సర్వేను మడుగువారిగొంది రెవెన్యూ గ్రామంలో చేపట్టామన్నారు. నిత్యావసర సరుకులను ఇంటింటా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గృహనిర్మాణశాఖ ఏఈ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 199 గృహాలు మంజూరు కాగా.. రూ.12.60 లక్షల బిల్లులతో పాటు 36 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 40 బస్తాల చొప్పున సిమెంటు అందించామన్నారు. జగనన్న లే అవుట్‌లలో ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులకు 480 సిమెంటు బస్తాలు అందించామన్నారు. 424 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు అందించామని పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలని ఎంపీపీ అన్నారు. వెలుగు ఏపీఎం సూర్యనారాయణ మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, స్త్రీనిధి రుణాలతో పాటు బ్యాంక్ లింకేజీ రుణసదుపాయం సంఘం సభ్యులకు కల్పించామని చెప్పారు. వైద్యశాఖ వైద్యాధికారి మహేశ్వరమారుతి, ఉపాధిహామీ, మండల జెఈ, ఆర్‌డబ్ల్యూఎస్ జెఈలు శాఖలపురోగతిని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ అంజినప్ప, వైస్ ఎంపీపీలు భారతి, గంగోజమ్మ, ఎంపీటీసీలు ఖమర్‌జహాన్, సోమశేఖరరెడ్డి, జయరామిరెడ్డి, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

కొత్తచెరువు: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు. గురువారం ఎస్పీ మాధవ రెడ్డి ఆదేశాలతో కొత్తచెరువు సర్కిల్ పరిధిలోని మలుపుల్లో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదల తొలగింపు పనులు చేపట్టారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాల్లో సూచికలను ఏర్పాటు చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు. పుట్టపర్తి, బుక్కపట్నం రహదారులలో ముందస్తుగా లైట్లను ఏర్పాటు చేశామన్నారు. సర్కిల్ పరిధిలో పూర్తిగా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.



ముళ్ల పొదల తొలగింపు పనులు చేస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పావగడ: తాలూకాలోని గోరసమావు గ్రామ క్రాస్ వద్ద గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆ గ్రామానకి చెందిన తిమ్మయ్య గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంలో గ్రామం నుంచి వస్తుండగా క్రాస్ వద్ద ఓ ప్రైవేట్ బస్సును ఢీ కొన్నాడు. ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయమై స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పుట్టపర్తి టౌన్: భారత రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని గణేష్ కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. వెంటనే అతడ్ని అరెస్ట్ చేయాలన్నారు. ప్రధాని మోదీ ప్రజా సమస్యలు పట్టించుకోలేదన్నారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతున్నారన్నారు. అనంతరం సాయిఆరామంలో సీపీఎం జిల్లా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్బిరెడ్డి, ప్రవీణ్, పెద్దన్న జంగాలపల్లి పెద్దన్న, శ్రీనివాసులు, పార్టీ నాయకులు అంజి, గంగాధర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కదిరి టౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గురువారం సాయంత్రం ఓ వ్యక్తి స్పృహ తప్పి పడిపోయి ఉండగా.. 108లో చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగా.. మృతి చెందాడు. సదరు వ్యక్తి రైల్వేస్టేషన్ రోడ్డుకు చెందిన నరసింహులుగా గుర్తించారు. ఇతడి తండ్రి పేరు రామాంజనేయులు అని పోలీసులు తెలిపారు. అయితే ఆస్పత్రికి మృతుడి బంధువులు ఎవ్వరు రాలేదని పట్టణ పోలీసులు పేర్కొన్నారు. ప్రస్తుతం నరసింహులు మృతదేహం కదిరి ఆస్పత్రిలోని మార్చురీలో ఉంది.

29 నుంచి ఉచిత కుట్టు శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో నిరుద్యోగ గ్రామీణ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ, జర్దోసి జరీ మగ్గం వర్క్‌లో శిక్షణ కార్యక్రమం ఈ నెల 29 నుంచి ప్రారంభిస్తున్నట్లు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ లోకనాథ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. 19 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్న వారు మాత్రమే అర్హులన్నారు. 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08554-255925,9618876060, 9440905479 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి ఆంజనేయ స్వామి ఉత్సవాలు

మడకశిరరూరల్: మండలంలోని చందకచర్లలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకూ ఆంజనేయస్వామి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 13న సీతారాముల కల్యాణోత్సవం, 14న హనుమాన్ జయంతి, జ్యోతుల ఉత్సవం, మధ్యాహ్నం స్వామి బ్రహ్మరథోత్సవం, 15న స్వామికి పంచామృతాభిషేకం, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.